క్లుప్తంగా

లింగ వివక్షతను వ్యతిరేకిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న వెలుగు సిబ్బంది, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు

బొండపల్లి: లింగ వివక్షతను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వెలుగు ఏపీఎం కె.సూలోచనాదేవి అన్నారు. లింగ వివక్షతకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ లింగ భేదం చూపకుండా మగ, ఆడ పిల్లలను సమానం గా చూడాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అనంతరం మండలంలోని గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, బుక్ కీపర్లు, బ్యాంకు మిత్రలు తదితరులు కలిసి లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు.

జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ పనులు



విద్యుత్ సంభాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది, పెద్దలు

వేపాడ: బల్లంకి గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. గృహనిర్మాణాలకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమార్ ఆధ్వర్యంలో స్తంభాలు వేయించారు. గ్రామ పెద్దలు బల్లంకి కనక రాజు, నూకిరెడ్డి తాతారావు పనులను పర్యవేక్షించారు.

మొక్కజొన్న సాగులో నిమగ్నం



ఎం.వెంకటాపురంలో మొక్కజొన్న విత్తనాలను నాటుతున్న రైతులు

గజపతినగరం: మండలంలో ఖరీఫ్ వరికోతలు దాదాపు పూర్తి కావడంతో రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టిపెట్టారు. ఎం.వెంకటాపురం, పాతశ్రీరంగ రాజపురం, కొత్తశ్రీరంగరాజపురం, కాలంరాజుపేట, పిడిశీల, సీతారామపురం, తుమికాపల్లి తదితర గ్రామాల్లో వరికోతలు పూర్తయిన పొలాల్లో రైతులు మొక్కజొన్న విత్తనాలను నాటుతున్నారు. అధికశాతం మంది రైతులు లైన్ సోయింగ్ పద్ధతిలో విత్తనాలు నాటుతున్నారు.

బొలెరో, కారు ఢీ



పొలంలో బోల్తా పడిన బొలెరో వ్యాన్

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారి–26పై శనివారం వేకువ జామున ఎదురెదురుగా వస్తున్న బొలెరో వ్యాన్, కారు బలంగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో రెండు వాహనాలూ నుజ్జునుజ్జయ్యాయి. అదే సమయంలో విజయనగరం వైపు నుంచి వస్తున్న మరో బొలెరో వ్యాన్ ఈ రెండు వాహనాలను తప్పించే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ఆయా వాహనాల్లో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. హైవేపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా కారు, బొలెరో వాహనాన్ని పోలీసులు పక్కకు తరలించారు.

ఆకట్టుకున్న వయెలిన్ కచేరి

విజయనగరం టౌన్: పద్మశ్రీ ద్వారం వెంకటస్వామినాయుడు జయంతి సందర్భంగా స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించిన వయోలిన్ కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై హెచ్.రామచరణ్ కచేరీని హృద్యంగా ఆలపించారు. మృదంగంపై పి.మెహర్‌సాగర్ సహకరించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎల్ఎస్ శాస్త్రి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

19న జిల్లా స్థాయి పోటీలు

విజయనగరం అర్బన్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ నెల 19న జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ బి.లింగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ–కామర్స్ మరియు డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుని రక్షణ' అనే అంశంపై ఈ పోటీలు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ముందుగా పాఠశాల, మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఆదివారం పాఠశాల స్థాయి పోటీలను నిర్వహించి ఎంపికైన విజేతలకు ఈ నెల 18న మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 19న స్థానిక ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

- ఇది పేదల కోసం పని చేసే ప్రభుత్వం
- జనవరి నుంచి సామాజిక పింఛన్ రూ.3 వేలకు పెంపు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తవలస: అప్పన్నదొరపాలెంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తూ, బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తవలస: అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతం కృషి చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రెల్లి గ్రామ సచివాలయం పరిధిలోని అప్పన్నదొరపాలెం, జోడిమెరక, తమ్మన్నమెరక గ్రామాల్లో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయ కులతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగు న్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అప్పన్నదొరపాలెం గ్రామంలో జల జీవన్ మిషన్ లో భాగంగా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, సీసీ కాలువలు, రోడ్లు నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరారు. సమస్యలను నమోదు చేసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించడంతో పాటు త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి–1వ తేదీ నుంచి సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథ కాలు అందిస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో తెలుగు దేశం పార్టీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి మాయ మాటలు చెబుతారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మండల జేసీఎస్ ఇన్ చార్జి బొంతల వెంక టరావు, సర్పంచ్‌లు జోడి రాములమ్మ, అల్లం సత్యనారాయణ, ఉప సర్పంచ్ సుంకరి అక్కయ్య, ఎంపీటీసీ ఉగ్గిన గురిజీ, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, ఉగ్గిన పద్మనాభం, పల్లా భీష్మ, పి.ఎస్. ఎన్.పాత్రుడు,అమరపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: తమ్మన్నమెరక గ్రామంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



గుర్ల: పెద్దబంటుపల్లిలో వృద్ధురాలికి పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న నాయకులు సన్యాసినాయుడు, బంగారునాయుడు

గడప గడపకూ సంక్షేమం

గుర్ల: పార్టీలకతీతంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు అన్నారు. మండలంలోని పెద్దబంటుపల్లిలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని, గ్రామంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పేద ల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ గెడ్డపు సతీష్, ఎంపీటీసీ కంకణాల గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కంకణాల రమణ పాల్గొన్నారు.

జనవరి నెలాఖరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



బొండపల్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, తదితరులు



వేపాడలో లబ్ధిదారులతో సమావేశమైన ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, తదితరులు

బొండపల్లి: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె దుర్గాప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్‌డేలో భాగం గా మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావే శమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గృహనిర్మాణాలకు ఇసుక, సిమెంట్ అందిస్తున్నామని, నిర్మాణల దశ ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని, త్వరతిగతిన పనులు పూర్తి చేయాలని చెప్పారు. మండలంలోని జగనన్న లేవుట్లలో ఇంకా వివిధ దశల్లో 569 గృహనిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్, హౌసింగ్ ఏఈఈ గంగాధర్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు.

అధికారులు శ్రద్ధ పెట్టాలి

వేపాడ: లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు,గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనా రాయణ కోరారు. వేపాడ సచివాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహలబ్ధిదారులతో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న గృహనిర్మాణాలను త్వర గా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణాల పర్యవేక్షణలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో జగనన్న లేఅవుట్‌తోపాటు సొంత స్థలాల్లో కలిసి 124 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. వీటిలో సొంత స్థలాల్లో 48, జగనన్న లేఅవుట్‌లలో 13 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీఓ కూర్మనాథ్‌పట్నాయక్, తహసీల్దార్ ప్రసన్నకుమార్, గృహనిర్మాణశాఖ ఏఈ అప్పలనాయుడు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, వార్డుమెంబర్లు మిరపాకర మణ, ముత్యాలునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్



జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ ఆధ్వర్యంలో విజయ్‌దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాలను ప్రదర్శించారు. రమణ మాట్లాడుతూ పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించి ఆ దేశ ఆవిర్భావం కోసం 1971లో పాకిస్తాన్‌పై భారత్ యుద్ధం చేసిందన్నారు. 1971 డిసెంబర్ 3న ప్రారంభమైన యుద్ధంలో 13 రోజుల అనంతరం భారత్ సాయుధ బలగాలకు పాకిస్తాన్ సైన్యం లొంగిపోయిందని, ఈ విజయానికి ప్రతీకగా ఏటా డిశెంబర్ 16 విజయ్ దివస్ నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులు చరిత్ర తెలుసుకోవాలన్నారు. హెచ్ఎం జగన్నాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శశిభూషణరావు

విజయనగరం: నగరంలోని తోటపాలెం సత్య డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. విజయదుర్గ యూత్ సొసైటీ, విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధీరా ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శిబిరంలో 50 మంది యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతం విద్యా సంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సత్య డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధ్యాపకులు మీసాల సత్యవేణి, సూరప్పనాయుడు, విజయదర్గ యూత్ సొసైటీ అధ్యక్షురాలు చంద్రిక, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామష్, సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు, పూర్ణ, సాయి, షణ్ముక, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ప్రారంభం



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లిమర్ల: ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలు నెల్లిమర్లలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కార్మిక సంఘాల కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కార్మిక సంఘాల కార్యాలయం ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ, అటు దేశంలో ఇటు రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వాలు నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. ఒక పక్క నిరంకుశ విద్యావిధానాలతో విద్యార్థులను చదువుకు దూరం చేస్తూనే.. మరోపక్క చదువు చెప్పే ఉపాధ్యాయులు పట్ల కూడా ప్రభుత్వాలు కర్కశంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ పావని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి. రామ్మోహనరావు, జిల్లా సహాయ కార్యదర్శి జె. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

21న భగవద్గీత శ్లోకపఠన పోటీలు

చీపురుపల్లి: గీతా జయంతిని పురస్కరించుకుని స్థానిక కొత్తగవిడివీధిలోని శ్రీ కృష్ణ మందిర ప్రాంగణంలో ఈనెల 21వ తేదీన భగవద్గీత శ్లోకపఠన పోటీలు నిర్వహించనున్నట్లు గీతాసత్సంగ్ సేవాశ్రమ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 21న మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94401 05279, 70327 60344 నంబర్లకు ఫోన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

బియ్యం వేలం రేపు

చీపురుపల్లి: పౌరసరఫరాల అధికారులు 2023 మే 16న చేసిన తనిఖీల్లో సీజ్ చేసిన 150 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 18న బహిరంగ వేలం వేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ పిన్నింటి రామారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి ఎంఎల్ఎస్ కేంద్రం వద్ద 18న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య బియ్యంను బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

16 ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం రేపు

దత్తిరాజేరు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని రైతుభరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమ వారం ప్రారంభించనున్నట్లు ఏఓ అనురాధ శనివారం తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పల నాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ కేంద్రాలను ప్రారంభిస్తారని చెప్పారు.

ఘనంగా కావడి అట్టం



కావడి అట్టంలో పాల్గొన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దీక్షాపరులు

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి అట్టం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూల్‌బాగ్‌లో కొలువైన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో భక్తులు కావడి పట్టుకుని స్వామివారిని స్తుతిస్తూ భజనలు చేశారు. ఆలయం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దారిపొడువునా కావడి మోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సచివాలయాలు,హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. తుఫాన్ వల్ల వరితో పాటు నష్టపోయిన పంటలన్నింటినీ గుర్తించి, జాబితా సిద్ధం చేయాలని ఏఓ మల్లికార్జునరావుకు సూచించారు. జాబితాలను రైతుభరోసా కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అపరాల పంటలు నష్ట పోయిన రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఏఓ తెలిపారు.నష్టపోయిన రైతులకు 1,600 కిలోల మినుములు ,32 కిలోల పెసర, 190 కిలోల రాగులు అందించనున్నట్లు చెప్పారు. 1వ తేదీ నుంచి నాలుగు సచివాలయాలకు కలిపి ఒక చోట జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నామని దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యవతి తెలిపారు. 2025 నాటికి టీబీని పూర్తిగా నిర్మూలించాలని ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ పీఓ ఉమా భారతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓప్రకటనలో తెలిపారు. నెలరోజుల పాటు ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీన కుచేలదినోత్సవం , 23న ముక్కోటి ఏకాదశి నేపథ్యంలో వైకుంఠద్వార దర్శనం, 24న అన్నసమారాధన, 25వ తేదీన 108 లీటర్ల ఆవుపాలతో స్వామివారికి అభిషేకం, 28న చిత్రాన్న నివేదన, జనవరి–4 సహస్రదీపాలంకరణ, 12న కూడారైసేవ, 14న భోగి రోజున గోదా,రంగనాథుల కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ఆదివారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

పథకాలను సద్వినియోగించుకోవాలి



ఎల్‌సీడీ స్క్రీన్‌లో ప్రధాని సందేశాన్ని వింటున్న ఎంపీ జి.వి.ఎల్.నరసింహరావు,తదితరులు

వేపాడ: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగించుకుని, పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహ రావు సూచించారు. మండలంలోని సోంపురం గ్రామంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రకు ఆయన అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ను ప్రత్యేక వాహనంలో అమర్చిన ఎల్‌సీడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీ జి.వి.ఎల్.నరసింహరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా చేయడ మే బీజేపీ లక్ష్యమన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల్ పథకంలో భాగంలో పేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామని చెప్పారు. ఆయుష్మాన్‌భవ, పీఎం కిసాన్ తదితర పథకాలను వివరించారు. అనంతరం పలువురికి ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. డీసీసీబీ చైర్మన్ వి.చినరాము నాయుడు, ఎంపీటీసీ సత్యనారాయణ, ఎంపీడీఓ కూర్మనాథపట్నాయక్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, మండల బీజేపీ అధ్యక్షుడు జి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి నివాళి



చీపురుపల్లి: షేక్ సాబ్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు షేక్ సాబ్జి సేవలు మరువలేనివని ఆసంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు గొర్లె పద్మావతి అన్నారు. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి చెందడంతో మండలంలోని రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన చిత్ర పటానికి శనివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ షేక్ సాబ్జి మృతితో గొప్ప నాయకుడుని కోల్పోయామని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షే మంతో పాటు ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. ఉపాధ్యాయులు మిరియాల అప్పా రావు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి గజపతినగరంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం నివాళులర్పించారు. సాబ్జి చిత్ర పటానికి అంతా కలిసి పూలమాలలు వేశారు. అంగన్‌వాడీల ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుభాషిణి, పి.జ్యోతి, నాగమణి, నారాయణమ్మ, వాణి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలంతా ఐక్యంగా ఉండాలి



మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి సభ్యులతో ఆ సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీను

మెరకముడిదాం: మాదిగలంతా ఐక్యంగా ఉండాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను పిలుపునిచ్చారు. ఉత్తరావల్లి గ్రామంలో చీపురుపల్లి నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి కన్వీనర్ కిల్లాడ సురేంద్ర బాబు మాదిగ ఆధ్వర్యంలో కార్యవర్గ సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ కమిటీ, చీపురుపల్లి నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల పునర్నిర్మాణంపై సభ్యులతో శ్రీను చర్చించారు. కమిటీలను త్వరగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పొందూరు విజయ, రామారావు, రాము, చంటి, నరేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు, చేర్పుల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామంలో ఓట్ల తొలగింపు, చేర్పులపై నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి రమేష్ శనివారం ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన వారి పేర్లను ఇటీవల నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల ద్వారా బీఎల్ఓలు తొలగించారు. ఇలా ఓట్లు తొలగించబడిన వారి కుటుంబ సభ్యులతో ఎన్నికల ప్రత్యేక అధికారి రమేష్ మాట్లాడి, నిజనిర్ధారణ చేసుకున్నారు. అలాగే రెండు చోట్ల ఓట్లు ఉన్న వాటిలో ఒక చోట ఓటు తొలగించిన వారితో కూడా మాట్లాడి, ఎక్కడైనా ఒక ఓటే ఉండాలని వారికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఓట్ల తొలగింపు, చేర్పులపై పరిశీలన చేస్తున్నామని చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.